క్లుప్తంగా

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: పూలే, అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. వచ్చే నెల 12, 14న తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా వేడుకలను నిర్వహిస్తుండగా.. జయప్రదం చేయాలని అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ, అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల సత్యం, నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగానికి మహర్దశ

కూసుమంచి: సహకార రంగానికి మహర్దశ రాబోతుందని ప్రభుత్వ అధీనంలోని క్రిబ్‌కో కంపెనీ సేల్స్ అధికారి నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని పూర్యాతండాలో నిర్వహించిన రైతు అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుజరాత్‌లోని మొట్టమొదటి జాతీయ సహకార విశ్వ విద్యాలయాన్ని త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయంగా మార్చుతూ లోక్‌సభలో బిల్లు ఆమోదించారని, దీంతో మత్స్య, పాడి, మార్కెటింగ్, ఫైనాన్స్ తదితర రంగాల్లో రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. డీలర్ నెల్లూరి జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీకి జటాయు మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థకు రెండు నూతన జటాయు మిషన్లను రూ.55 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. నగరంలో రోడ్ల వెంట, కూడళ్లల్లో పడవేసిన వ్యర్థాలను శుభ్రం చేసేందుకు ఈ మిషన్లు కొనుగోలు చేశారు. సంవత్సరం పాటు ఈ మిషన్ల నిర్వహణను సంబంధిత సంస్థ చూడనుండగా.. శనివారం నగర మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఈ మిషన్ల పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, ఈఈ కృష్ణలాల్, డిఈఈ ధరణి కుమార్, ఏఈఈలు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నేలకొండపల్లి: వచ్చే నెల 13న వైరాలో జరిగే జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం పాలేరు ఏరియా కార్యదర్శి రామదాసు, లెనిన్, ఉపేందర్, విజయ్, కె.బిక్షం తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగడ్డలో ఇఫ్తార్ విందు

ఖమ్మం మామిళ్లగూడెం: రంజాన్‌ను పురస్కరించుకొని సబ్బండ వర్గాల ఆత్మీయ మిత్రుల ఆధ్వర్యాన శనివారం ఖమ్మం తుమ్మలగడ్డ గ్లోబల్ హీల్లింగ్ సెంటర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు ఖాజా, కిజారుల్లా, ముస్లిం మతపెద్దలు, దొడ్డి కొమరయ్య సినిమా కమిటీ జిల్లా చైర్మన్ షేక్ అబుద్ద్ రెహమాన్, సేనాపతి, మామిడాల ఝాన్సీ, సామ్రాజ్యం, ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కెమెరా సెట్టింగ్స్‌పై వర్క్‌షాప్



పార్టిసిపేషన్ సర్టిఫికెట్లతో ఫొటోగ్రాఫర్లు

ఖమ్మంగాంధీచౌక్: సోని కెమెరా మెనూ సెట్టింగ్స్‌పై శనివారం నగరంలోని స్థానిక ఓ హోటల్‌లో ఫొటోగ్రాఫర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ రామకృష్ణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాతో పాటు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఫొటోగ్రాఫర్లు సత్కరించారు. అనంతరం డెలిగేట్స్‌కు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్, కోశాధికారి తిరుపతిరావు, ఖమ్మం టౌన్ అధ్యక్షుడు రఘు, కార్యదర్శి ఖాజాబాబా, కోశాధికారి రంజిత్ పాల్గొన్నారు.

గ్యాస్ పైప్‌లైన్ వద్ద మాక్‌డ్రిల్

కామేపల్లి: సహజ వాయువు సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని జీఐటీఎల్ ఏజీఎం దీపక్‌రాయ్ కోరారు. కామేపల్లి మండలం తాళ్లగూడెం సమీపాన ఉన్న జీఐటీఎల్ సంస్థ పైపులైన్‌ను పరిశీలించి, ప్రమాదవశాత్తు లీకేజీ ఏర్పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీఎఫ్‌ఓ అజయ్‌కుమార్, సీఐ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఏఓ తారాదేవితో పాటు సంస్థ బాధ్యులు, నాయకులు దీపక్‌రాయ్ సాయికిషోర్, వేణుగోపాల్, గుజ్జర్లపూడి రాంబాబు, గింజల నరసింహారెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక సమాజంలోనూ యువత సంప్రదాయ దుస్తులు ధరించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పండుగ అయినా, విశేషమైన, ప్రాముఖ్యత కలిగిన రోజుల్లోనైనా సంప్రదాయ దుస్తులు ధరిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఆధునిక పోకడలను అంది పుచ్చుకుంటున్నప్పటికీ ప్రత్యేక సందర్భాల్లో సంప్రదాయ దుస్తులు ధరిస్తూ ఈ తరంలో వచ్చిన మార్పును ప్రతిబింబిస్తున్నారు. ఈక్రమాన తెలుగు వారి తొలి పండుగ అయిన ఉగాది సందర్భంగా ప్రత్యేక కథనం. – ఖమ్మంసహకారనగర్



సంప్రదాయ దుస్తుల్లో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల విద్యార్థినులు

సదా.. సంప్రదాయం

- పండుగలు, పర్వదినాల్లో సంప్రదాయ దుస్తులకే జై
- విద్యాసంస్థల వేడుకల్లోనూ ఈ వస్త్రధారణకే మొగ్గు
- గతంతో పోలిస్తే యువతీ, యువకుల్లో మార్పు

అత్యధికంగా ఇలా..

ప్రధానంగా పండుగ రోజులైన ఉగాది, దసరా, దీపావళి, వినాయక చవితి, శ్రీరామనవమి పండుగలతోపాటు ఇళ్లల్లో శుభకార్యాలు, పాఠశాలలు, కళాశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో సైతం యువత సంప్రదాయ దుస్తులు ధరిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం..

యువతకు సంప్రదాయబద్ధమైన అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు పండుగల సమయంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తున్న క్రమంలో దుస్తుల ఉపయోగంపై సైతం అవగాహన కల్పిస్తున్నారు. ఇదే సంప్రదాయాన్ని విద్యార్థినులు తమ పాఠశాలలు, కళాశాలల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొంటుండడం తెలుగు సంప్రదాయాలపై వారికి ఉన్న మక్కువ అర్థమవుతోంది.

సంప్రదాయ దుస్తులకు క్రేజ్



ప్రస్తుత ఆధునిక ప్రపంచంలోనూ సంప్రదాయ దుస్తుల వినియోగంపై ఎక్కువ దృష్టి పెట్టారు. ప్రత్యేకంగా యువత దీనిపై ఆసక్తి పెరిగింది. కుట్లు, అల్లికలతో పాటు ప్రత్యేకంగా పండుగల వేళ సంప్రదాయాలు ఉట్టిపడే దుస్తులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మాకు అధికంగా సంప్రదాయ దుస్తుల కోసం ఆర్డర్లు వస్తున్నాయి.

– సంపంగుల స్వాతి, బొటిక్ నిర్వాహకురాలు, ఖమ్మం

మొదటి పండుగ



తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ఉగాది పండుగ ప్రతీక. మన పండుగలన్నీ ప్రకృతి నుంచి వచ్చినవే. కాలానుగుణంగా అనుసరించడమే ఉగాది ప్రత్యేకత. పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి తినడం ఈ పండుగ ప్రత్యేకత. సంప్రదాయ చిహ్నంగా వస్త్రధారణ చేయడం మరో విశిష్టత.

– బి.ఝాన్సీ, బీఏ, ద్వితీయ సంవత్సరం

సంస్కృతిని అనుసరించడమే పండుగ



ఎన్ని పండుగలున్నా ఉగాది పండుగ ప్రత్యేకమైంది. ఆరుగాలం శ్రమించిన రైతు విశ్రాంతి తీసుకునే సమయం. ప్రకృతిలో ప్రత్యేకమైన మామిడి, వేపపూత, పులుపు, చేదు, వగరు, తీపి షడ్రసోపేతమైన సమ్మేళనమే జీవితమని చెప్పే ఈ పండగను ఆనందంగా జరుపుకుంటాం.

– బి.త్రివేణి, ఎమ్మెస్సీ, ద్వితీయ సంవత్సరం

పిల్లలకు అవగాహన కల్పించాలి..



మా పాపకు చిన్నతనం నుంచే తెలుగు సంప్రదాయం, సంప్రదాయ దుస్తులపై అవగాహన కల్పిస్తున్నా. పండుగ వేళలు, ఇతర ప్రత్యేకమైన కార్యక్రమాల్లో సంప్రదాయ దుస్తులు ధరిస్తుంటుంది. ప్రతి ఒక్కరూ పిల్లలకు సంప్రదాయంపై అవగాహన కల్పిస్తే భవిష్యత్ తరాలకు మరింత ఉపయోగంగా ఉంటుంది.

– టి.కృష్ణవేణి, విద్యార్థిని తల్లి

నవ ఉషస్సుల ఉగాది

విశ్వావసు నామ సంవత్సర వేడుకలకు సమాయత్తం

ఖమ్మంగాంధీచౌక్: మామిడాకుల తోరణాలు.. మంగళనాదాలు, కోకిలమ్మ రాగాలు, వసంతుని వలపు గీతాలు, వేపపూల వగరు భాష్యాలను తెలిపే ఉగాది పండగ వచ్చేసింది. తెలుగు రాష్ట్రాల్లో తొలి తెలుగు పండగ, నూతన ఉత్సాహాలకు నాందిగా జరుపుకునే ఈ పండగకు ప్రజలు సిద్ధమయ్యారు. చైత్రశుద్ధ పాడ్యమి రోజున ప్రారంభమయ్యే ఈ పండగను ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు దేవాలయాలు, ఇళ్లను మామిడి తోరణాలతో అలరించుకున్నారు. షడ్రుచులతో కూడిన పచ్చళ్లు, వంటకాలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మగువలు ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి పండగను స్వాగతిస్తారు.

నూతన పనులు ప్రారంభం

ఉగాది రోజున కొత్త పనులను ప్రారంభించటం ఆనవాయితీ. ప్రధానంగా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. వ్యాపారులు నూతన తెలుగు సంవత్సరం నుంచి వ్యాపార లావాదేవీల నిర్వహణకు నూతన దస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈనేపథ్యాన పలుచోట్ల పంచాంగ శ్రవణాన్ని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



సామూహిక పూజలు చేస్తున్న వ్యాపారులు(ఫైల్)

పంచాంగ శ్రవణానికి ప్రాముఖ్యం

ఆలయాలు, మాధ్యమాల్లో పండితులు వినిపించే పంచాంగ శ్రవణానికి ప్రజలు ప్రాధాన్యత ఇస్తారు. దీని ద్వారా ఈ ఏడు మన స్థితిగతులను ముందే తెలుసుకోవచ్చని నమ్మకం. ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానం, కాలం తీరు, పంటల సాగు వంటి అంశాలను కూడా పంచాంగంలో పండితులు వినిపిస్తారు.

ఉగాది పచ్చడి ప్రత్యేకం..

ఉగాది వసంత రుతువు ఆగమనం ప్రారంభమైన రోజు. ఈ రోజున షడ్రుచులు కలిపిన పచ్చడి తయారు చేసి తింటారు. పచ్చడిలో ఉండే ఒక్కో పదార్థం ఒక్కో భావానికి, అనుభవానికి ప్రతీక. ఇందులో

- బెల్లం: తీపి, ఆనందానికి సంకేతం
- ఉప్పు: జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతం
- వేప పువ్వు: చేదు, బాధ కలిగించే అనుభవాలు
- చింతపండు: పులుపు, నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు
- పచ్చి మామిడి ముక్కలు: వగరు, కొత్త సవాళ్లు
- కారం: సహనం కోల్పోయేట్లు చేసే పరిస్థితులు

షడ్రుచులకు వేళాయె..!



మామిడి తోరణాలు, మామిడి కాయల కొనుగోళ్లు



ఉగాది పచ్చడి తయారీకి కుండలు

ప్రకృతిలో కొత్త చిగుళ్లు పూచి.. గతకాలపు కష్ట నష్టాలు తొలగిపోయి.. కొత్త ఆశలతో నూతన శకానికి నాంది పలకాలని కోరుకుంటూ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడి కోసం కూడళ్లలో లభించే మామిడి కాయలు, వేప పువ్వు, తదితరాలను కొనుగోలు చేసే పనిలో ప్రజలు నిమగ్నమయ్యారు. -స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కోటమైసమ్మ ఆలయాభివృద్ధికి కృషి

కామేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువైన కోటమైసమ్మ తల్లి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా ఆలయంలో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజైన శనివారం ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి పూజలు చేశాక మాట్లాడారు. ఆతర్వాత కామేపల్లిలోని రైతు వేదికలో 23మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులతో పాటు 91మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి, ఎస్సై సాయికుమార్, ఆలయ ఈఓ నల్లమోతు శేషయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, మద్దినేని రమేశ్‌బాబు, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, ధరావత్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టీ స్టాల్ ప్రారంభం..

మండల కేంద్రంలో మహిళా శక్తి పథకంలో భాగంగా ఊట్కూర్‌కు చెందిన నాగెల్లి సంధ్యకు స్త్రీ టీ స్టాల్‌ను ఎమ్మెల్యే కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా టీ చేశారు.

నేడు సౌత్ జోన్ కార్యాలయం ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిపాలనను ప్రజలకు దగ్గరగా చేర్చేందుకు అధికారులు జోనల్ విధానాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. నగరంలో నాలుగు దిక్కుల నాలుగు కార్యాలయాలతో పాటు సెంట్రల్‌లో కేఎంసీ కార్యాలయంలో జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేసి డివిజన్లలో పరిపాలనను అందించేందుకు నిర్ణయించారు. ఉగాది సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయంలోని సౌత్ జోన్ కార్యాలయాన్ని ఆదివారం మేయర్ నీరజ ప్రారంభించనున్నారు. ఈ జోన్ పరిధిలో 18, 23, 24, 25, 26, 37, 38, 39, 40, 42 డివిజన్లు ఉండనున్నాయి. మంగళవారం నుంచి ఆయా డివిజన్లకు సంబంధించిన పాలన ఇక్కడ నుండే జరగనుంది.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం యూపీహెచ్ కాలనీలోని స్వయంభూ శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవములు ఆదివారం మొదలుకానున్నాయి. ఐదురోజుల పాటు జరిగే ఉత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. తొలిరోజు విశ్వక్సేన పూజ, గరుడప్రసాద వితరణ ఉంటాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లి కొమరయ్య, పురం తిరుపయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సన్మానాలు..

● వర్గీకరణ ఉద్యమకారులకు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లాలో ఎస్సీ వర్గీకరణ పోరులో క్రియాశీలకంగా పనిచేసిన ఉద్యమకారులను ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్‌ల ఖమ్మం జిల్లా కమిటీలు శనివారం ఖమ్మంలో ఘనంగా సత్కరించాయి. అనంతరం కేక్ కట్ చేసి ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సంబరాలు ఘనంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్‌ల రాష్ట్ర నాయకుడు బచ్చలకూర వెంకటేశ్వరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్, అంజయ్య, జాతీయ నాయకుడు కొలికపోగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజు, ప్రభాకర్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ముత్తారావు, రవి, రాము, శ్రీను పాల్గొన్నారు.

● విద్యుత్ ఎస్‌ఈలకు..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్‌ఈగా మూడేళ్ల పాటు పనిచేసి బదిలీ అయిన ఎ.సురేందర్, నూతనంగా ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టిన ఇనుగుర్తి శ్రీనివాసాచారిలను ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు శుక్రవారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సన్మానించారు. జిల్లాలోని విద్యుత్ డీఈలు, ఏఈలు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకలు

ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పార్టీ జెండాలను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం పార్టీ జెండా ఆవిష్కరించాక ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేతినేని హరిష్‌చంద్ర, సీతయ్య, వెంకటనారాయణ, రాజేశ్వరి, అప్పారావు, సత్యవతి, రామారావు, రజిని పాల్గొన్నారు. అలాగే తిరుమలాయపాలెం మండలం జల్లెపల్లి వేడుకలు నిర్వహించగా.. పార్టీ నాయకులు మోహన్‌రావు, బాబు, రమేష్, లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందిస్తున్న మార్కెట్ చైర్మన్ సీతారాములు, దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు వీల్‌చైర్లు, ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ టీవీలు, కోనాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఎంఈఓ బి.చలపతిరావు, ఏఓ ఎం.రాధ, వైద్యాధికారి బింధు, ఫౌండేషన్ సభ్యులు సురేష్, నవీన్, రషీద్, అనిల్‌కుమార్, నాయకులు రమేష్, గోవిందరావు, స్వర్ణ, భద్రయ్య, నాగేశ్వరరావు, నవీన్, నాగరాజు, అంజిని, ఇటిక్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ..

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో పేదముస్లింలకు పెదతండా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాను తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్, ఫూల్‌చంద్, హరి, కొండల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోశాలలకు దాణా వితరణ

ఖమ్మంగాంధీచౌక్: పాల్గుణ మాస బహుళ అమావాస్య సందర్భంగా శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన శనివారం నగరంలోని గొల్లగూడెం శ్రీ కృష్ణ గోశాల, టేకులపల్లిలోని శ్రీ వేంకటేశ్వర మందిరం గోశాల, కరిగిరి శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి దేవాలయ గోశాలలకు రూ.70 వేల విలువైన దాణా వితరణ చేశారు. స్తంభాద్రి సేవా సమితి కన్వీనర్ లక్ష్మీనరసింహారావు, మల్లేశం, రామారావు, భద్రయ్య, సంపత్ కుమార్, నారాయణరావు, శ్రీనివాసరావు, రమేష్, వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

● పాఠశాలకు బెంచీలు, స్టూళ్లు..


ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గుట్టలబజార్‌లో ఉన్న శ్రీ రామకృష్ణ విద్యాలయం ప్రాథమిక పాఠశాలకు బెంచీలు, స్టూళ్లను లయన్స్ క్లబ్ 320ఈ డిస్ట్రిక్ట్ గవర్నర్ యరాల ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ధ్వంసలాపురం గ్రామానికి చెందిన పేద మహిళ ఏలినేటి భవానికి కుట్టు మిషన్‌ను అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి జి.శ్రీరామ్, డాక్టర్ రాఘవరెడ్డి, డీసీపీ రావు, ఎం.వెంకటేశ్వరరావు, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా నగరంలోని సహకారనగర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లను గవర్నర్ అందించారు. లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పేద ముస్లింలకు నిత్యావసరాలు..

తిరుమలాయపాలెం: మండలంలోని జింకలగూడెంలో చేగువేరా భూపతి ఫౌండేషన్ (సీబీఎఫ్) ఆధ్వర్యాన శనివారం ఆరుగురు పేద ముస్లిం కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ జి.చంద్రశేఖర్ మాట్లాడగా.. ఫౌండేషన్ సభ్యులు ఘంటా భీమయ్య, సప్పిడి నాని, రమేష్, అజీత, కొండ సందీప్, సుధాకర్, హరిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

కూసుమంచి: బాలల పరిరక్షణ అందరి బాధ్యతని మండల ప్రత్యేకాధికారి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి సమాజంలో బాల్య వివాహాలు, బాలలను భిక్షాటన చేయించడం, చదువు చెప్పించకపోవడంతో వారి భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. ఇలా జరగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తర్వాత బాలల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను కౌన్సిలర్ నిరీష వివరించారు. అనంతరం బాలిక సంరక్షణపై బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏసీడీపీఓ ఉదయశ్రీ, మెడికల్ ఆఫీసర్ కిషోర్, ఏఓ వాణి, ఎంపీఓ రాంచందర్‌రావు, ఏపీఎం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

అందరూ మెచ్చేలా అభివృద్ధి, సంక్షేమం

- అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.



శ్రీరాంహిల్స్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: ప్రజలందరూ మెచ్చేలా తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో రూ.3కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పొజిషన్ పత్రాలు అందజేశారు. అంతేకాక ఖమ్మం 18వ డివిజన్ శ్రీరాంహిల్స్‌లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.కోటితో చేపట్టే రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసిన మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు తొలుత పేదలకు అందాలనే లక్ష్యంతో ఉన్నామని చెప్పారు. కాగా, వీ.వీ.పాలెంలో మంత్రి పర్యటన సందర్భంగా ఓ వృద్ధురాలు కోతుల బెడదను వివరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, కమిషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, ఆర్డీఓ నరసింహారావు, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, తహశీల్దార్ విల్సన్‌బెన్నీ, ఎంపీడీఓ అశోక్‌కుమార్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, డీఈ మహేష్, ఎఈ చిరంజీవితో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, బాలసాని లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, తల్లాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రానైట్ పరిశ్రమల సబ్సిడీ జీఓను అందిస్తున్న మంత్రి

గ్రానైట్ పరిశ్రమలకు ఊతం

ఖమ్మంఅర్బన్: కష్టాల్లో ఉన్న గ్రానైట్ పరిశ్రమలను కాపాడేలా పెండింగ్ సబ్సిడీ విడదల చేయడమే కాక శ్లాబ్ సిస్టమ్ అమలుకు నిర్ణయించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు రుణపడి ఉంటామని గ్రానైట్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు, పాటిబండ్ల యుగేందర్, నాయకుడు సాధు రమేష్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో శనివారం వారు మాట్లాడుతూ ఏళ్లుగా సబ్సిడీలు పెండింగ్ ఉన్న విషయమై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా సీఎంకు వివరించగా రూ.19 కోట్లు మంజూరు ప్రకటించి రూ.6కోట్లు విడుదల చేశారన్నారు. అప్పట్లో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, మళ్లీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి తమ ఇక్కట్లు గుర్తించారని తెలిపారు. అసోసియేషన్ బాధ్యులు కమర్తపు గోపాలరావు, పరమేష్‌రెడ్డి, తమ్మినేని సాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సబ్సిడీల మంజూరు జీఓ ప్రతులను అసోసియేషన్ బాధ్యులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు.

సంక్షిప్త సమాచారం..

● సీపీఎం పోరాటంతోనే ఇంటి పన్ను రద్దు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం పోరాటాల ఫలితంగా మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు ఇంటి పన్ను రద్దు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. శనివారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు రాయితీ గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా నాయకులు ఎంఏ జబ్బార్, నవీన్‌రెడ్డి, శ్రీనివాసరావు, నర్రా రమేష్, బేగం, ఇమామ్, కార్పొరేటర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● రూ.7 వేల నుంచి రూ.18 వేలకు వేలం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ అధీనంలో ఉన్న వీడీఓ క్వార్టర్స్, లక్ష్మీ మహిళా మండలి కాంప్లెక్స్‌లను అద్దెకు ఇచ్చేందుకు శనివారం వేలంపాట నిర్వహించారు. ఈనేపథ్యాన ఒక్కో క్వార్టర్ దుకాణం రూ.6,100 చొప్పున మూడు వీడీఓ క్వార్టర్లు, గతంలో నెలకు రూ.7వేల అద్దె కల్గిన రెండు మహిళా మండలి దుకాణ సముదాయాలను రూ.18 వేలతో శ్రీను అనే వ్యాపారి దక్కించుకున్నారు. ఇవి రెండేళ్ల పాటు వీరి పరిధిలో కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ తదితరులు పాల్గొన్నారు.

● 'గోర్‌బోలీ' గుర్తింపుపై హర్షం

ఖమ్మంరూరల్: బంజారా భాష గోర్‌బోలీని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం హర్షణీయమని ఆల్ ఇండియా బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తినాయక్ అన్నారు. మండలంలోని పెదతండాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం కూడా గోర్‌బోలీ భాషను అధికారికంగా గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు భూక్యా శోభన్, జర్పుల భీములు, ఎ.అశోక్, తేజావత్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

● మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: భద్రాచలంలో ఆరు అంతస్తుల భవనం కుప్పకూలి మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలో జరిగిన సపమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్డింగ్ యజమానిని అరెస్ట్ చేయాలని, గ్రామపంచాయతీ అధికారులను విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుక్కముడి సంపత్, జిల్లా అధ్యక్షుడు దేవరకొండ కిరణ్, రాష్ట్ర మహిళా నాయకురాలు కనుకు రాధా, కృష్ణబాబు, కోటేశ్వరరావు, వెంకన్న, వీరస్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.